
# మస్తాన్ ట్రంకుపెట్టె




పొడుగాటియువకుడు తోలుసూట్ కేస్‌తో వడివడిగా నడుస్తూ వచ్చాడు.

నేను మా రామనాథము డిగ్రీలు సంపాదించుకున్నామన్న మాటయే గాని మూడు యేండ్లనుండిన్నీ కేవలం నిరుద్యోగ సమస్యలో బడి, యీదులాడుతూనే యున్నాం.! ఉద్యోగమంటే లేదుకాని, సిగరెట్లు ఊదడము, షైర్లకు వెళ్ళడము వగయిరా వ్యవహారాలను యెలా మానుకోవడం? అలాఅని చదువుకునే రోజుల్లోకి మల్లే చీటికీమాటికి పెద్దవాళ్ళను డబ్బుకోసము వేపుకొని తినడానికి వీలా?- అంచేత చాటునా మాటునా మానాన్నగారు యింట లేనప్పుడు అమ్మదగ్గర కష్టాల కాలువలు ప్రవహింపజేసేసరికి ఒక్కొక్కమారు రూపాయలు తరుచు చిల్లరాలుతూయుండేవి. కాని నిరుద్యోగసమస్యలో ఉన్నామేమో-- పరిచయస్తుల ముఖాలు చూడడమంటే యెంత మాత్రమును యిష్టము వుండేదికాదు. అంచేత యింటిలోవుంటే యేదోవో మూరుమూలగదిలోనో కూచోవడమో లేకపోతే వూరు బయ

టకు జారి, చెట్లమ్మాట, పుట్టలమ్మాట, వాగులమ్మాట పడిపోతూ యుండడమో చేస్తూ యుండేవాళ్లం.

ఒకనాడు నాన్నగారు క్యాంపుకు వెళ్లారు. అంచేత యింటికి వచ్చే పరిచయస్తులరద్దీ తగ్గింది. మేమిద్దరమును వీధి తలుపు చేరగిలవేసి పడక కుర్చీలలో కూచుని సిగరెట్లు కాల్చుకుంటూ యుండగా పోస్టుబంట్రోతు ధనలక్ష్మితో ప్రత్యక్షమయ్యాడు. నాచేతికి 40 రూపాయల మనియార్డరు అందించి సంతకము చేయమన్నాడు. నేను ఆశ్చర్యపోయాను. అనుమానంవేసింది యీ మనియార్డరు నాకా, నాలాంటిపేరేగల మరెవరికన్నానా? అని. పేరు యింటిపేరు, యింటినంబరు అన్నీనాకే యీ మనియార్డరని సూచించినయి. ఎవరు చెప్మా నాకు డబ్బు పంపేవారని చూచేసరికి, నే నెప్పుడో రెండేళ్లక్రితం నాస్నేహితుడికి 40 రూపాయలు అప్పు యిచ్చా. అది యీనాడు పంపాడతను!

* * *

రామనాథం మా ప్రక్కవీధిలోనే వుంటున్నాడు. అతనికి సహజంగా నేనంటే పడదు. కాని నాతో ఉండక తప్పినది కాదు. ఏదో కాలం వెళ్లబుచ్చాలిగా, అందువల్ల తిండి తినేవేళలలో తప్ప యితర సమయాలలో నాతోనే ఉండేవాడు. తన యింటిదగ్గర ఉందామంటే రామనాథం తండ్రి పెన్షన్ ఉద్యోగి, అంచేత దివారాత్రాలు యింట్లోనే ఉంటారు. రామనాథం కనబడినప్పుడల్లా ఆయన 'ఒరే, సోమరిపోతా' అంటూ దీవిస్తూ వుంటారు. అంచేత ఆయన కంటబడకుండా వుండేందుకు దొడ్డిత్రోవను యింటోకి వెళ్ళడం, ఆవేళకు యున్ని మెతుకులు తినడము మళ్ళీ చప్పుడు లేకుండా బయటకు రావడము: యిది అతనిపద్ధతి. ఇటువంటి పరిస్థితులవల్ల అతను నాతో సఖ్యతగా వుంటున్నాడే గాని యిద్దరమున్ను స్నేహితులై యుండేందుకు తగిన అభిప్రాయాలుగాని, తలపులుగాని యిద్దరిలోనూ లేవు. ఇది అవసరములతో కూడుకొనిన స్నేహమేగాని మరేమిన్నీ కాదు.

... ... ...

రూపాయలు వచ్చాయి; యింక పరమానందమైంది నాకు. పైకి రామనాథం నవ్వుతూవున్నా అతనుమాత్రం లోలోన యీర్ష్య కలిగి ఉంటూనేయున్నాడు, అది నేను అతని నవ్వుయొక్క తరహానుబట్టే గ్రహించా.

కాని వీటన్నింటితోను నాకు ప్రమేయములేదు; రూపాయలు వచ్చాయి, నాతోబాటు రామనాథంకూడా కొంత సంతోషంగా కాలం గడపాలి. అంచేత ప్రోగ్రామ్ వేశాము.

నెల్లూరునుంచి మదరాసువెళ్లి కాస్త పూర్వపుజీవితం గడపుదామనుకున్నాం. యిద్దరమును రైలుఎక్కాం. ఆరోజు బండి యెంచేతనోగాని ఖాళీగావుంది, అందులోనూ పాసింజరు ట్రెయిన్‌లో యింటర్ కంపార్టుమెంటులోఎక్కి తలుపు వేసుకొని Goldflake కాలుస్తూ కూచున్నాం.

పోర్టరు గంట మ్రోయించాడు: ఒక

పొడుగాటి యువకుడు తోలు 'సూట్ కేస్' (leather case)తో వడివడిగానడుస్తూ వచ్చాడు మాపెట్టెవైపు. ఆయనవెనకనే బరువైన ట్రంకును మోస్తూ ఒకకూలీ పరుగెడుతూ వచ్చాడు. 'గార్డు' యీలవేశాడు. జండా ఊపాడు. యువకుడు మా కంపార్టుమెంటు తలుపుతెరిచి సూట్ కేస్ బండిలోపెట్టి లోపలికి యెక్కి కూచున్నాడు. తరవాత కూలీ ఆబరువైనట్రంకును లోనికి త్రోశాడు. ఆయువకుడు జేబులో నుండి వో రూపాయితీసి కూలీచేతిలో పడవేసి సిగరెట్ ముట్టించాడు. "బాబూ, చిల్లరలేదు" అన్నాడు కూలీ. యువకుడు చేతిని ఫరవాలేదనే భావంతో విసరి, "అక్కర్లేదు" అన్నాడు.

మేం ఆశ్చర్యపోయాం, యెవరో బండి ప్రక్కనేపోతూ 'అతనే మస్తాన్'అన్నారు. బండి యీలవేసింది, కదలింది.

ఒకటోరకం సిల్కుసూటువేసుకునికూచున్న ఆ యువకుడి ముఖం అందెంచేతనో గాని ఆకర్షవంతంగా కనబడింది. అంచేత మేం అతనికేసి రెప్పవేయకుండా చూస్తూ వున్నాం. ఆయువకుడు వోసిగరెట్ కాల్చి పారవేసి రెండో సిగరెట్ తీసుకొంటూ సిగరెట్ కేస్ విప్పి మాయెదుట పెట్టాడు. పరిచయం లేకపోయినా 'వద్దు' అనలేక పోయాం. అతను చాల గౌరవంగా సిగరెట్ తీసుకోమనినా అది వో ఆజ్ఞలా వుంది. మారుమాటాడకుండా తీసుకున్నాం. ముగ్గురమును సిగరెట్లు ముట్టించాం. ఆయన యెంతో స్నేహమున్నట్టుగా మాతో మాటాడడము మొదలుపెట్టాడు.

ఆయువకుడు మేము నిరుద్యోగ సమస్యలో నున్నట్లు గ్రహించి మాటాడాడు. అతనలా అనేసరికి నాకు మరింత యెక్కువ ఆశ్చర్యంవేసింది. ఇలా మనిషిని చూచేసరికి అతని పరిస్థితులన్నీ గ్రహించినట్లుగా కల్పితములైన అపరాధ పరిశోధక నవలలో చదవడమేగాని యెక్కడా ప్రత్యక్షంగా యిదివరకు చూడలేదు; యిదే మొదటిసారి. నే తెల్లబోయాను. ఆయన అతివేగంగా భావయుక్తంగా మాట్లాడుతూ యున్నాడు.

"ఏమోనండి, మన దేశంలోని నాయకులుగాని ప్రభుత్వాధికారులుగాని నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి యింతవరకును పూనుకొనలేదు. నేను కూడా యిదివరలో డిగ్రీ సంపాదించాక నాలుగేళ్లు ఉద్యోగం కొరకు అదేతిరగడం తిరిగా, కాని లాభం లేకపోయింది. అది అంతా వృధాప్రయాస అయింది. ఆకరుకు విసిగి పూర్తిగా ఆప్రయత్నములను మానుకుని 'మానవుడు సౌఖ్యంగా జీవించటానికి ప్రయత్నించాలి, అందుకు యేపని నన్నా చేయవచ్చు'నని నిర్ణయించుకొని నాదారిని నేను అనుసరించాను. అప్పటినుండీ యెటువంటి కొరతలేకుండా ఒకేరీతిని కాలం గడచిపోతూవుంది."

ఆయన మరొక సిగరెట్ ముట్టించాడు. కొంచంసేపు నిశ్శబ్దంగా వూరుకున్నాం. ఆతరవాత ఆయన నావైపు చూస్తూ

అన్నాడు. "నేనెవరినో యెరుగుదురా?" అన్నాడు.

నేను "తెలియదండి క్షమించాలి" అన్నాను.

"మీరు విన్నారా, నెల్లూరులో నుండి దిగుతూ యున్నప్పుడు యెవరో మన కంపార్టుమెంటు ప్రక్క నుండి వెళ్తూ 'మస్తాన్' అన్నాడు?"

"ఆ, విన్నానండి"

"నేను మస్తాన్" అన్నాడు ఆయన.

... ... ...

మస్తాన్! మస్తాన్!

ఏమస్తాన్? ... ...

మస్తాన్ మాటాడాడు....

"మన కంపార్టుమెంటు ప్రక్కగా వచ్చి పోయినవాడు పోలీసు వుద్యోగి. సి.ఐ.డి. అదివాడిపని. నేను చక్కగా—హాయిగా జీవిస్తూ వుంటే వీళ్ళందరికీ అనుమానం. కన్నుయెఱ్ఱ. అంచేత వాళ్లు నేను కాలు కదిపానంటే వెంటాడతారు.

* * *

రైలు ప్రక్కస్టేషనులో ఆగింది. మళ్ళీ యింకొకరెవరో మాకంపార్టుమెంటులోకి తొంగిచూచారు. మస్తాన్ మాత్రం ఆతన్ని చూచికూడా చూడనట్టుగా సిగరెట్ పుగ వదలుతూ కూచున్నాడు.

* * *

రైలు స్టేషనులో ఆగింది. స్టేషన్ మాస్టరును కలుసుకోనాలంటూ మస్తాన్ సూట్ కేసుతో దిగి వెళ్ళాడు. బండి కదలి పోయింది. మస్తాన్ రాలేదు. దిగినమస్తాన్ తిరిగి బండియెక్కలేదు. మాకాశ్చర్యం. బండి గూడూరులో ఆగింది. మస్తాన్ రాలేదు. పెద్ద పెట్టెమాత్రం మా కంపార్టుమెంటులోనేవుంది. నేను ప్లాట్‌ఫారంమీద యెక్కడన్నా ప్రత్యక్షమౌతాడేమోనని చూస్తూవుంటే పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరు మా వద్దకు వచ్చి "మీతోబాటు మదరాసు ప్రయాణం చేస్తూయున్న ఆ పెద్దమనిషి యేడి?" అని అడిగాడు. సబ్ ఇన్‌స్పెక్టరుతో మరియిద్దరు పోలీసులు వచ్చారు.

మధ్యదారిలో—స్టేషనులో దిగిపోయాడని చెప్పాం; బండి కదలింది.

మస్తాన్ వెళ్ళిపోయినా మస్తాన్ యొక్క పెద్దట్రంకుమాత్రం మా కంపార్టుమెంటులోనే వుంది. ఏం చేయడం? ... ...

...ఆలోచించాం... నిరుద్యోగపు దినాలలో చిక్కియున్న మాకు అనేక చెడ్డ తలపులు కలిగాయి. అందులోనూ యిద్దరికన్నీ స్వార్థము యెక్కువైపోయింది. మొదట రామనాథం 'యీ పెట్టి నేను తీసుకుంటా'నన్నాడు. నేను అది యెలా? యిద్దరము చెరిసగమున్నూ పంచుకుందాం, ధనికుడి పెట్టెలో మన దరిద్రం తీరేటంతటి డబ్బు వుంటుందన్నా. రామనాథం చిరుతపులిలా దెబ్బలాడడము మొదలుబెట్టాడు.

రైలువచ్చి సెంట్రలులో ఆగింది. ముందు పెట్టిమీద రామనాథం చెయ్యివేశాడు. అంత పట్టుదల వస్తే యితనికెందుకు వదలాలని నేను అడ్డువెళ్ళా. రామనాథం నన్నుగెంటాడు. నేను అతనిని కసితో త్రోశాను. సరే, పెద్ద దొమ్మి, కేకలు. మా పెట్టియెదుట పదిమంది మూగారు. యేమిటంటే యేమిటన్నారు.

'ఇది నాపెట్టి, యితను తీసుకుపోతానంటాడు' అని రామనాథం అన్నాడు. అతని పెట్టికాదు నాదేనని నేనన్నాను. పిల్లుల్లాగు దొమ్ములాడుతూ వుంటే పోలీసులు హాజరై కీచులాడుతూవున్న యిద్దరిని పట్టుకున్నారు. మావాదనలు విన్నారు. విని సరే తాళపుచేతులు తీయమన్నారు. ఉంటేగా తీయడానికి? పెట్టి మాది అయితేగా? ఇద్దరము తెల్లముఖాలు వేశాం.




పిల్లుల్లాగు దొమ్ములాడుతూవుంటే పోలీసులు హాజరై ............

సరే. పెట్టి మాదెవ్వరిదినీ కాదని నిజం చెప్పివేశాం. సరే పెట్టెను ఇన్‌స్పెక్టర్ సమక్షమున పగులగొట్టారు. అందులోనుండి వజ్రాల ఉంగరములు, బంగారునగలు, వెండిసామానులు గలగలమని రాలినవి. అన్నీ సరిక్రొత్త సామానులు! యేదో షాపులోనుండి తీసుకువచ్చినట్లున్నాయి.

"రామా జ్యూయలరీ తాలూకువి! మస్తాన్‌గాడు తప్పించుకుపోయాడే!" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

మస్తాన్ దొంగ! అంతచక్కగా ఆర్థిక విషయముల గురించి, నిరుద్యోగ సమస్యగురించి మాటాడిన మస్తాన్ దొంగ! అని ఇద్దరము ఆశ్చర్యపోయాం.